
నదీతీరంలో కళ్లు విప్పిన నాగరికత, నది కంటినే కలుషితంతో పూడుస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో పుట్టి పెరిగిన నేను వెనకటి రోజుల వ్యవసాయంలో నాగరికత అవశేషాలయిన ఎడ్లను, నాగరికతకు అస్తిత్వమైన నదిని వెతుక్కుంటూ వరిచేను గట్టుమీద నడిచాను. సహజత్వం కోల్పోయిన మనిషి ప్రకృతికి అసహజత్వాన్ని ఆపాదిస్తున్నాడా?


బహుశా వేణుగోపాల్

1

# ఎద్దు గిట్టలు

భాస్కర్





నది ఆగిపోదు. అలసట తీర్చుకోదు. కాకపోతే విసిగిపోయి ఉండొచ్చు. ఒడ్డున కూర్చొని తన ప్రవాహంలో తానే కాళ్లు పెట్టింది. పగలంతా నదిపై, చుట్టూతా శబ్దప్రపంచం. లోకానికి రాత్రి అనేది ఒకటుంటుంది. అప్పుడు సకల జీవరాశి పడుకుంటుంది. నిద్ర అనే పదం నదికి తెలియదు. నిశ్శబ్దంగా ఉన్న రాత్రులన్నీ అది తన తీరంలో ఉన్న పశువుల గిట్టల గుర్తులతో ఊసులాడుతుంది. మాట్లాడేటప్పుడు నది నగలన్నీ తీసేసి ఉంటుంది. తీరంలో పశుసంపద గుర్తులన్నీ నదికి సహజ అలంకారాలు. చాలారోజులుగా అది ఆవుల గిట్టల్ని అడగాలనుకున్న మాట అప్పుడడిగింది.

"ఎద్దుగిట్టల గుర్తులు కనబడడం లేదేమిటి?"

ఆ ప్రశ్నకు సమాధానం నిశ్శబ్దంగానే ఉంది.

కాసేపయ్యాక తిరిగి అదే ప్రశ్న అడిగింది.

"అవి వ్యవసాయం నుండి గెంటేయబడ్డా,"యని మౌనంతో ఖేదిస్తూ మేకగిట్టల గుర్తులు చెప్పాయి.

"ఎద్దులు అదృష్టవంతులు. వాటికా భాగ్యం దక్కింది. మాకది లేదం,"టూ మనసు విప్పాయి గేదెగిట్టల గుర్తులు.

ఆవులు సహజసిద్ధంగా మృదుస్వభావులు. బెదురుగొడ్లు. పారే నదిని చూసి భయపడేవి. అవి ఆరోజు ధైర్యంగా తమ బాధను నదికి చెప్పాయి.

"పశు ఆధారిత వ్యవసాయం ఇప్పుడు లేదు. మా పశువుల జీవితాలన్నీ పాలకేంద్రాల పాలయ్యాయి. దుక్కి దున్నినా, ధాన్యాన్ని ఇళ్లకు చేర్చినా అన్నీ యంత్రాలే. అంతెందుకు... నాట్లు వేయడానికి, కోత కోయడానికి కూడా మనుషుల అవసరం లేదిప్పుడు! మనిషికి పాలు, మాంసం కోసమే మా జన్మ రహస్యం అన్నట్టు తయారయ్యింది. అదే మాకు మోక్షం. గేదెపాలకంటే మా పాలలో కొవ్వుశాతం తక్కువ. మమ్మల్ని పోషించడం రైతుకి నష్టమని నెమ్మదిగా మా సంఖ్యను తగ్గించేసాడు. గేదెల మందలో ఎక్కడో జంటగా లేదా ఒంటిగా ఉంటుంటాం."

గేదెగిట్టలు ఆ సంభాషణ మధ్యలో కలుగజేసుకున్నాయి.

"ఆవుల వల్ల ఆదాయం తక్కువగానూ, గేదెలవల్ల ఎక్కువగానూ ఉన్నా ఆవులకే మర్యాద ఎక్కువ. వాటిని పూజిస్తారు. పాపం అని కొట్టరు. కానీ, మా దేహాలపై దెబ్బలు దేవుడికే ఎరుక. మనిషి పాలు తీసుకునేటప్పుడు మేం కదిలినా, మెదిలినా చావగొడతాడు.

"ఆ సమయంలో మా బిడ్డవంక చూడడానికి కూడా భయపడతాం. మాకు పాలివ్వడానికి ఇంజక్షన్లు చేస్తారు. ఆ పాలు తాగి వ్యాధులకు గురయ్యేది వారే. జబ్బుల్ని 'కొని' తెచ్చుకుని నాశనమవుతున్నారు. వాళ్ల ఆర్థిక సంపదలో మూగజీవాలైన మేం భాగం. కానీ, మా వృద్ధాప్యం వీళ్లకు భారమయి కబేళాలకు అమ్మేస్తారు. చూసారా! మా చావు కూడా వాళ్ల జేబు నింపుతుంది. పైగా మనుషుల్లాగా మాకు దినకార్యాల ఖర్చు కూడా లేదాయె! వట్టిపోయిన మేమంటే మనుషులకు ఎంత చిన్నచూపు. అందుకే ఎద్దుల్లా మేమూ అంతరించిపోవాలనుకుంటున్నాం. ఎద్దులు ఏదో పుణ్యం చేసుకున్నాయి."

నదికి ఒక ఆత్మీయస్పర్శ దూరమైపోతుందన్న భావన. తనకూ భగవంతుడు నిద్రనిస్తే బాగుంటుందనిపించింది. కాసేపలా నిద్రలోనైనా ఈ ప్రపంచాన్ని మర్చిపోవచ్చుగా! తనకిష్టమైన కలల్ని కనొచ్చు.

ప్రతి రాత్రి నదీతీరంలోని వెదురుతోపుల్లో పుట్టే నిస్తంత్రి సంగీతం వింటూ విసుగును పోగొట్టుకుంటుంది. చంద్రుడిని దాటేటప్పుడు మేఘాలు తెల్ల ఏనుగుల్లా కనబడతాయి. వాటినలా చూస్తుంటుంది.

కాలం ఉదయమవుతుంది.

ప్రతి ఉదయం నదికి ప్రత్యేకమే. పొద్దుటి చల్లదనాన్ని మింగేస్తూ సూర్యుడు నులివెచ్చని స్పర్శతో పర్వతాల పైన నిలబడి పక్షుల్ని పిలుస్తాడు. ఉదయ సాయంకాలాలు పిలుపుకు ప్రతిస్పందనగా చెట్టుమీది పక్షులు ఆకాశంలో తిరుగాడుతుంటాయి. నదిమీద లేత ఆవిరి కింద చేపలన్నీ ఆడుకుంటాయి. నదికి తన సంతతిలో ఇష్టమైనవి చిన్నచేపలే. జాలర్లు వాటిని పిత్తపరిగెలు అంటారు. అవి చేసే సందడితోనే తన ఇల్లు కళకళలాడుతుంది.

కాళ్లీడ్చుకుంటూ ఒడ్డుమీద తిరిగే మనుషులుంటారు. ఆ మనుషులు యవ్వనంలో ఉన్నా చూపులు వృద్ధాప్యంలో ఉంటాయి. వాళ్ల కళ్లల్లో సముద్రాలు కనబడతాయి. మనిషిలో ఎంత వేదన!

నది ఎన్నోసార్లు కన్నీళ్లు పెట్టుకుంటుంది. ఎవరికి కనబడతాయవి? కళ్లు ఉన్నంత మాత్రాన అందరికీ అన్నీ కనబడతాయా!

చేపల్ని వలల్నుండి ఒడుపుగా పట్టుకునే జాలర్లు బతుకుదెరువుకి పడవ లెక్కుతున్నారు. వాళ్లకి చిన్నప్పట్నుంచీ నదే తల్లి, సమస్తప్రపంచం. వాళ్లు లంగర్లేసి పడవల్ని కట్టేచోట జీవితాల్ని విప్పుకుంటుంటే వింటుంటుంది. విశ్రాంతి తీసుకుంటున్న పడవలన్నీ నది పాడే జోలపాటకు తూగుటుయ్యాలలవుతాయి. అసలు నది అందమంతా మిట్టమధ్యాహ్నామే. కటిక ఎండకు ఇసుకరేణువులన్నీ బంగారపు పొడులగుట్టల్లా మెరిసిపోతుంటే రెండుతీరాల నడుమ ఏకబారు వజ్రంలా కాంతులీనుతుంది.

ఆ నదిలో ఒక ఇసుకరేణువు ఉంది. అది నదికంటే ముందే పుట్టిందని దాని నమ్మకం. చాలా యథార్థాలు, అబద్ధాలు అలా నమ్మకాలపైనే ఆధార పడతాయి. రేణువుకు అక్కడ నిత్యం జరిగే సన్నివేశాల పట్ల ఏ ఉత్సుకత లేదు. ఇసుకరేణువు అతిచిన్నదైనా విశ్వమంతటి అతిపెద్ద ఆలోచనలు చేస్తుంది. అందుకే అక్కడున్న మిగతావన్నీ నిరర్థకమైనవనే అభిప్రాయం దానికి బలపడింది, చివరికి నదితో సహా. 'తన అస్తిత్వమే నదికి గుర్తింపు,' అనుకుంటుంది.

అది ఒడ్డుమీద ఉంది. నది అలలు ముందుకొచ్చి మాటిమాటికీ దాన్ని తడుపుతుంటాయి.

అది మిట్టమధ్యాహ్నం కావడంతో నది సన్నబడి కొంచెం వెనక్కు తగ్గుతుంది. దాంతో ఇసుకరేణువు పొడిబారింది. తీరంలో సుడిగాలి రేగింది. అది నది పక్కగా వెళుతూ ఆ ఇసుకరేణువును తన సుడిలోకి లాక్కెళ్లింది. ఇసుకరేణువుకు అమాంతం తనో శక్తివంతమైన పదార్థమనే విశ్వాసం బలపడింది. నదికంటే తానిప్పుడు ఎత్తులో ఉంది. అహానికి హద్దు లేదు. కాసేపయ్యాక గాలి సద్దు మణిగింది. నెమ్మదిగా మాయమైంది. ఏం జరిగిందో అర్థంకాక మునుపే ఇసుకరేణువు దబ్బుమని వరిచేలో పడింది.

నదినీరు వరిచేనంతా వ్యాపించి ఉంది. ఇసుకరేణువు ఆశ్చర్యపోయింది. ఈ మొక్కలకు, నదినీటికి సంబంధం ఏమిటో అర్థంకాలేదు.

నది నవ్వింది. దాని మనోగతాన్ని అర్థం చేసుకుంది.

"వీటిని వరిమొక్కలు అంటారు. వీటినుండి వచ్చిన గింజల్ని ఇక్కడి ప్రజలు తిని బతుకుతారు. ఇవే కాకుండా ప్రపంచమంతా ఎన్నో ధాన్యపుగింజలు. నది నుండే

ఆహారం, నాగరికత మొదలయ్యాయి. నది అంటే నేను కాదు. నాలాంటి ఎన్నో బిందువులు కలిస్తే అది నది. అలాగే తీరమంటే నువ్వు కాదు. ఎన్నో ఇసుక రేణువులు కలిస్తే అది తీరం.''

ప్రతీ నెర్రె దాహం తీర్చి వరిమొక్కల్ని ఆలింగనం చేసుకుంటున్న నదినీటికి ఇసుక పాదాభివందనం చేసింది.

''నేస్తమా, నేనో మిత్రుని కోసం పొలాలన్నీ వెతుకుతున్నాను. నువ్వొ సాయం చేస్తావా!'' అని నదినీరు ఇసుకరేణువుని అడిగింది.

అది సరేనన్నాక,

''పొలాల్ని ఎద్దులే దున్నేవి. ఇప్పుడు ఆ గిట్టల గుర్తులు ఏ మడిలోనూ కనబడడం లేదు. నీకూ అవి పరిచయాలే కాబట్టి పద వెదుకుదాం,'' అంది.

వరిమడిలో ప్రయాణం మొదలైంది. ఇసుకరేణువుకు ఈ మొక్కలన్నీ భలే అందంగా కనబడుతున్నాయి. సముద్రతీరంలో కొబ్బరిచెట్ల కిందున్న చల్లదనమంతా ఇక్కడే ఉంది. నదీతీరంలో గుంపులుగా ఎగిరే రామచిలుకల్ని చూసేది. ఆ పచ్చదనమంతా నేలపై నిలబడ్డట్టు ఉంది.

ఆ పొలాన్ని ప్రతి అంగుళం గాలించారు. ఎక్కడా ఎద్దుగిట్టల గుర్తులు కనబడలేదు. వేరొక పొలంలోకి మళ్లారు.

తనవెంట ఓపిగ్గా తిరుగుతున్న ఇసుకరేణువును నదినీరు అడిగింది.

''నీ వయస్సెంత?''

''అబ్బో! వేల యేళ్లు. మనుషుల్లా మనం రోజులు లెక్కపెట్టుకోవడానికి మనకు క్యాలెండర్లు లేకపోవచ్చు కానీ ఎన్ని పగళ్లు, రాత్రుళ్లు! నా ఊహ తెలిసే నాటికి పెద్దపెద్ద పచ్చటి మైదానాల్లో ఉండేదాన్ని. వేల యేళ్లు గడిచేసరికి ప్రకృతిలో మార్పులొచ్చాయి. అక్కడ వర్షపుచుక్క కూడా రాలేదు. క్రమక్రమంగా పచ్చదనం పోయి ఎడారి అయిపోయింది. కనుచూపు మేరంతా ఇసుక. నా మీద నుండి లొట్టి పిట్టలు నడచి వెళ్లాయి. వానలతో తడిసే ఆ మైదానాలు రక్తంతో తడిసిపోయేవి. మంటల్లో పడేసినట్టుండే సూర్యుడి వేడికి కాలిపోతూ బద్దలై పొడిగా మారిపోతానేమో నని భయం వేసేది.

''ఇసుక తుఫానులకు ఒయాసిస్సు దగ్గర పడ్డాను. అక్కడ మరెన్నో యేళ్లు గడిచాయి. ఒయాసిస్సులో దాహం తీర్చుకున్న గుర్రం మీసాలకు అంటుకు పోయాను. అది ఎడారి దాటి వాగు దాటుతుండగా అందులో పడిపోయాను.

"ఆ వాగు ఎన్నో వాగులతో ఒకటిగా కలుస్తూ పెద్ద నదిగా మారింది. ఇదిగో... చాన్నాళ్ల నుండి ఈ నదిలోనే ఉంటున్నాను."

వరిచేలో అక్కడక్కడా బీరు సీసాలున్నాయి. ఇసుకరేణువు వాటిని నదిలో చూసింది.

"ఇవి కూడా ధాన్యపు మొక్కలేనా?" అని అమాయకంగా అడిగింది.

"ఊహూ! అవి మద్యంసీసాలు. ఇక్కడున్నవారు మత్తుకోసం తాగి రోడ్డు పక్కనున్న పొలంలోకి విసిరేసారు. ఇదిగో ఇక్కడ ప్లాస్టిక్ కవరుంది చూడు. వీటిని వాటర్ ప్యాకెట్లంటారు. మనుషులు నీళ్లను కొనుక్కుని తాగుతారు," అని ఇసుక రేణువు అడగకుండానే మరో సందేహాన్ని నదినీరు తీర్చింది.

"ఇంత పెద్ద నది ఉండగా నీళ్లను కొనుక్కుని తాగుతారా! ఈ మనుషులు చాలా విచిత్రజీవుల్లా ఉన్నారే!" అంది ఇసుకరేణువు.

"మనుషులు విచిత్రజీవులే కాదు, హానికరజీవులు కూడా," అంటూ వీళ్ల సంభాషణని ఆసక్తిగా వింటున్న వరిగింజ తలాడించింది.

ఇసుక అర్థంకానట్టు చూసింది. వరిగింజ దానికి అర్థమయ్యేలా చెప్పడం మొదలెట్టింది.

"ఎప్పుడో సింధు నాగరికతలో లోథాల్ పట్టణంలో పుట్టాను. మా పూర్వీకులు ఎవరో తెలియదు. ఊహకు కూడా అందనివారు. ఇన్ని వేల యేళ్లలో ఏనాడు ప్రకృతి ఇంతటి విధ్వంసాన్ని ఎరుగదు. భూమి, నది, అడవి తమ అధీనంలో ఉన్నాయను కునే పిచ్చివాళ్లను వేల సంవత్సరాలుగా చూస్తూనే ఉన్నాను. ప్రకృతి ఎలుగెత్తి ఏడుస్తుంది. కానీ అది మానవహృదయానికి అందదు. మానవస్వభావమే యుద్ధోన్మాది. అది నిరంతరం ధ్వంసరచన పైనే దృష్టి పెడుతుంది. ఒకప్పుడు మాపైన తూనీగలు వాలేవి. వాటి పల్చటి రెక్కల గాలి మాకు అమితానందాన్నిచ్చేది. తేనెటీగలు తిరిగేవి. ఆహారానికి ఆధారాలు. అవి వచ్చినప్పుడు గౌరవించేవాళ్లం. సీతాకోకచిలుకల రంగుల్ని మాకు పులుముకునేవాళ్లం. ఇంకా ఎన్నో పురుగులు... పక్షులు. ఇవన్నీ మా కళ్లముందునుండే మాయమైపోతుంటే ఆత్మీయుల్ని కోల్పోతుంటాం. దుఃఖించడం తప్ప మేమేం చేయగలం. మా ఒళ్లంతా వాహనాల దుమ్ముతో నిండిపోయింది. రాత్రీ పగలు తేడా లేకుండా ప్లాస్టిక్ కవర్లు మా పొలం నిండా తిరుగుతుంటాయి."

ఇసుకరేణువుకు ఘాటుగా వాసన వేసింది. ఒళ్లంతా మంట పుట్టినట్టుగా ఉంది. వరిగింజ కంగారుపడొద్దంది.

"అది పురుగుమందుల ప్రభావం. ఎక్కువ దిగుబడి రావాలని విపరీతంగా మాపై చల్లుతారు. దాంతో నేల సారం కోల్పోయింది. కలుపు బలం పుంజుకుంది. దోమలైతే లెక్కచేయడం మానేసాయి. దాంతో మహాశక్తివంతమైన మందులు తయారుచేసారు. అవి ప్రకృతికి నష్టాన్ని చేకూరుస్తున్నాయని గవర్నమెంటు నిషేధించింది. నిషేధించిన మందులే మార్కెట్‌లో దర్జాగా అమ్ముతున్నారు. నిజానికి నిషేధించిన మందులే పంటను రక్షిస్తున్నాయి. రైతుకు అవి కొనక తప్పట్లేదు. అలా ప్రకృతిని అదుపు తప్పించారీ మనుషులు. మనిషి ఇంకో మనిషికోసం పరిగెట్టడం లేదు. స్వప్నాలు, సంపదల వైపే వాళ్ల పరుగు.

"ప్రకృతి అంటే సంపద అని మర్చిపోతున్నారు. అయినా మనుషులందరూ ఒక్కటే అని ఏకకుటుంబంగా ఉండలేని వారికి ఎంత చెప్పినా సముద్రంలో కారిన వానే. పోనీలే ఇంతా చేసి మనుషులైనా బాగుపడ్డారా అంటే అదీలేదు. ఇన్ని మందులు కొట్టిన పంటల్ని తినాల్సింది వారేకదా! సంపదతో అనారోగ్యాన్ని మూట గట్టుకుంటున్నారు. ఆరోగ్యాన్ని, అనారోగ్యాన్ని ఇచ్చే మందుల షాపులు కాలు మోపడానికి స్థలం లేనంతగా జనాలతో కిక్కిరిసిపోతున్నాయి.

"మారుతున్న కాలం మనుషుల్ని మారుస్తుంది. ఆ మార్పు ఫలితాలెలా ఉంటాయనేదే ప్రశ్న?

"అదిగో అటు చూడండి. పొలం గట్టుమీద రైతు కూర్చున్నాడు," అని వాళ్లిద్దరికీ చూపించింది వరిగింజ.

రైతు విశ్రాంతి తీసుకుంటున్నట్టుగా చేతులమీద వెనక్కువాలి కూర్చున్నాడు. మనిషిలో చలనం లేదు.

అతనికేమైంది అనడిగారు వాళ్లిద్దరూ.

"తెగుళ్లు సోకినప్పుడు పొలానికి వేసిన గుళికలు తిని అతని గేదె చనిపోయింది. అది సూడి గేదె. అందుకే అతడి బాధ."

ఇసుకరేణువు స్థాణువైంది. ఏమీ మాట్లాడలేకపోయింది.

వరిగింజ నిట్టూరుస్తూ అంది, "ఒక్కోసారి చేతివేలు కదపడానికి కూడా చాలా బలం కావాలి. అది శారీరక బలం కాదు.

"ఈ వరిపంటలో చాకిరీ ఎక్కువ, ఆదాయం తక్కువ. ప్రతిరోజూ ఒక్కసారైనా రైతు చేనుచుట్టూ తిరుగుతుండాలి.

"మొన్నామధ్య రైతుకొడుకు తండ్రికి సాయంగా పొలంపనికి వచ్చాడు. అతను బాగా చదువుకున్నాడు. అయితే మాత్రం ఉద్యోగాలెక్కడున్నాయి.

పల్లెటూళ్లలో కూడా చదువుకున్నవాళ్లు ఇంటికొకళ్లున్నారు. వ్యవసాయ కూలీలు తగ్గిపోయారు. పొలంపనులకొచ్చే వాళ్లెవరూ కనబడడంలేదు. అందుకే చదువుకున్న వాళ్లే ఎవరి పొలాల్లో వాళ్లు పనిచేసుకుంటున్నారు. రైతుకొడుకు పురుగుల మందు స్ప్రే చేయడానికొచ్చాడు. మోచేయి ఎత్తు పెరిగిన మడిలో వరి ఆకులు నునుపుగా మారి చేతుల్ని చీల్చుతుంటే చెయ్యి అటూ ఇటూ ఆడిస్తూ తిరగాలి. కింద చూస్తే అడుగు తీసి అడుగెయ్యాలంటే మోకాల్లోతు బురద. పాపం ఆ కుర్రాడు బరువైన ట్యాంకుని భుజాల మీదకెత్తుకుని చేను మధ్యలో మోకాళ్ల మీద కూలబడిపోయాడు. రైతు ఆగమేఘాల మీద పరిగెత్తుకొచ్చి లేపాల్సొచ్చింది. మందుతిళ్లు తిన్న ఎముకలు బోలుగా తయారయ్యాయి. ఈ బలంలేని తరంమీదే దేశాలు ఆధారపడి ఉన్నాయి.

"నిరుడు పంటలో పెద్ద భూస్వామి పొలంలో పెరిగాను. ఆయనగారు గవర్నమెంటోళ్లు ప్రమాదమని ఆపేసిన మందులు కూలీలతో కొట్టించాడు. అందులో ఒక కూలీ ఆ మందుల తీవ్రతకు స్ప్రే చేస్తూనే పక్షవాతం వచ్చినట్టు పడిపోయాడు. చేతులూ, కాళ్లూ ఇక్కలాక్కుపోయాయి. నురగలు కక్కేస్తుంటే గబగబా ఆసుపత్రికి తీసుకెళ్లారు. లక్షలు ఖర్చు చేసాక బతికాడు.

"కానీ ఆ మనిషి నరాలన్నీ అంతకుముందులా పనిచేయనివ్వడం లేదు. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు. బతికున్న శవాలు.

"ప్రకృతిని ప్రతిఘటిస్తే మనిషన్నవాడు భూమ్మీద మిగలడు. ప్రకృతి ముందు బియ్యంలో రాళ్లలా మనుషులు కొద్దిమందే. అయినా ప్రకృతిని ధ్వంసం చేస్తూ వాళ్ల మనుగడకు వాళ్లు ముప్పు తెచ్చుకుంటున్నారు. మానవజాతికి దేవుడిచ్చిన శాపమేమో! వేల ఏళ్లుగా వీళ్ల సంస్కృతులన్నీ నాశనమవుతున్నాయి. నాటిన ధాన్యపు మొక్క కూడా సంస్కృతే. అది మాత్రం నాశనం కాకుండా నిలబడి ఉంది. మనిషిని నిలబెడుతూ ఉంది.

"నిరుడు పంటలోనే మేము కోతకొచ్చిన సమయంలో ఎవరో సిగరెట్ కాల్చి మా పక్కనున్న తుప్పల్లోకి విసిరాడు. అవి తగలబడిపోయాయి. పొదలో పక్షి కట్టిన గూడుతో నేను స్నేహం చేసాను. ఆ మంటల్లో గూడు కూడా కాలిపోయింది."

ఆ మంటలు రేగినప్పుడు పుట్టిన ఉదారంగు వరిగింజ కళ్లలో ఇసుక రేణువుకు ఇంకా కనబడుతూంది.

వరిగింజకు కోపమొచ్చింది.

"వీళ్లకన్నా ఆధునిక మానవజాతి ఉద్భవించాలి. అతడు ఆదిమానవుడిలా ప్రకృతిని అర్థం చేసుకోవాలి. ప్రకృతిలోని మార్మిక రహస్యాలను తెలుసుకుని దానికి అనుగుణంగా జీవించాలి."

మళ్లీ అవి రెండూ మంకొండితనంతో ప్రయాణం మొదలుపెట్టాయి. పొలమంతా కలియజూస్తున్నాయి.

నదినీరుకు పొలం దుగంపై ఎద్దుగిట్టల గుర్తులు కనబడ్డాయి. తన కళ్లను నమ్మలేకపోయింది. వాటినే కళ్లలో నింపుకుని వెతకడం వల్ల అంతా తన ఊహ అనుకుంది. పరికించి మళ్లీ చూసింది. ఎద్దుగిట్టలే! గుర్తులు దాదాపు శిథిలావస్థలో ఉన్నాయి.

ఆనందం పట్టలేక నదినీరు గిట్టల గుర్తులతో అంది, "మీ కోసమే వెతుకుతున్నాం."

"ఎందుకు?" గుర్తులు దిగాలుగా అడిగాయి.

"ఎందుకేమిటి? మీరు నాగరికత చిహ్నాలు. పూజ్యనీయులు," అని చెయ్యెత్తి నదినీరు మొక్కింది.

ఇసుకరేణువు కూడా నమస్కరించింది.

చెట్టు మీదొక పక్షి ముక్కుతో రెక్కల్ని సవరించుకుంటూంది.

ఎద్దుగిట్టల గుర్తులు దీర్ఘంగా ఆలోచిస్తున్నాయి.

ఆలోచన నుండి తేరుకుని, "గతమెంతో ఘనకీర్తి కలవాడా అని పాడుకోవడం ఎప్పుడూ బాగుంటుంది. బతికిచెడ్డ స్మృతులే బాధిస్తాయి. హరప్పా నాగరికతలో దేవుళ్లుగా పూజలందుకున్నాం! వ్యవసాయంతో స్థిరమైన నివాసాలు ఏర్పరచుకుని అసలు నాగరికతలోకి రావడానికి మేమే కీలకమయ్యాం. నేను కోడెగిత్తగా అనుభవించిన స్వేచ్ఛను తలచుకోని క్షణం ఉండదు. ఎక్కడెక్కడికో తిరిగేదాన్ని. ఎదుగుతున్న కొద్దీ ఆంబోతయ్యాను. అప్పుడెంత అందంగా ఉండేదాన్ని! నన్నొకరోజు తాళ్లు పెట్టి కట్టిపడేసారు. గిల్ల కొట్టారు. ఎంత నొప్పి అనుభవించానో మాటల్లో చెప్పలేను. ఆ బాధ భరించే బదులు ప్రాణం పోతే బాగుండుననుకునేదాన్ని. నేను బాగయ్యాక భుజాన కాడి అలవాటు చేసారు. రాపిడికి మెడంతా పచ్చి పుళ్లు. అయినా తెల్లారాక మళ్లీ కాడెత్తేవారు. కాడి ఒరుసుకుపోతుంటే ఒళ్లు గిలగిల్లాడేది.

"కొన్నాళ్లకు సంతోషం నా జీవితంలోకొచ్చింది. మా రైతు దొర ఎద్దుని కొనుక్కొచ్చాడు. నాతో దాన్ని ఎడ్లబండికి కట్టినా, అరక దున్నినా, పట్టే పట్టును నాతో

సమన్వయం చేసుకుని బలం ఉపయోగించేది. భారాన్ని పంచుకోవడంలో ఇది వరకటి ఎడ్లు పనిదొంగల్లాగా ఉండేవి.

“మమ్మల్ని కట్టేసి మేత మేపినప్పుడు నేను కొంచెం తక్కువ తిని దోరెద్దుకు ఎక్కువ వదిలేసేదాన్ని.

“నా పిచ్చిగానీ నా బరువును పంచుకున్న దానికి నా కడుపులో ఆకలి తెలియదా! అది కూడా గడ్డిని నాకోసం వదిలేసేది.

“ఆషాఢంలో తొలకరి వానలు పడతాయి. వర్షంవల్ల బీళ్లు మెత్తబడ్డాక చచ్చు చేనునైనా చాలా లోతుగా దున్ని పంటకు సిద్ధంగా ఉంచడంలో మా జంట ముందుండేది. మా నాగలికి మొండినేలలైనా, జరుగడ్డి దుబ్బులైనా తెగిపడేవి. బండెద్దులుగా ఉండే కంటే దుక్కిటెద్దులుగా ఉన్నప్పుడే మేము గర్వపడేవాళ్లం. భూమిని దున్నుతుంటే మనుషులకు అన్నదానం చేస్తున్నట్లు సంతృప్తి కలిగేది. దుక్కి ఉంటేనే మనిషికి దిక్కు. మా రైతుకు మా జంట బాగా అచ్చొచ్చింది. ఊరంతా మమ్మల్ని పొగిడేది. ప్రతి రైతు మాకోసం పొలం పనులకు మా రైతు దగ్గరకొచ్చి బతిమలాడేవాళ్లు. మా రైతు గాదె ఏ సంవత్సరం వెలితిగా లేదు. పొద్దున్న కట్టిన నాగలి విప్పేసరికి రాత్రయ్యేది. కనుచూపు మేర భూమంతా పచ్చబడ్డాక మేమంతా అటువైపుగా వెళుతూ చూస్తే, ‘నాగలి ఉన్న ఊరు ఆకలి చేరదు,’ అని ఎందుకు అనేవారో అర్థమయ్యేది. మా జోడెద్దుల ఉల్లాసాన్ని చూసి ముసలెద్దులు కూడా రంకెలేసేవి.

“కోత కోసిన వరిని కుప్ప నూర్చాక వడ్ల బస్తాలను ఇంటికి చేరవేయడానికి బండెడ్లుగా రోజంతా ఇంటికీ, పొలానికీ తిరిగేవాళ్లం. ఏ రాత్రికో ఇంటికి చేరాక తిరునాళ్లకు బండి కట్టేవాళ్లు. దేవుని కార్యం అంటే అలసట ఉన్నా లెక్కచేసే వాళ్లం కాదు. బండినిండా పిల్లల్ని, పెద్దల్ని ఎక్కించుకుని పుంతల్లో ప్రయాణించేవాళ్లం. కీచురాళ్ల అరుపులు దేవుడికోసం తపస్సు చేసే ఋషుల ఓంకారంలా అనిపించేవి. మాగిన తాటిపళ్ల వాసన ముక్కుల్లోకి దూరిపోయేది. మా ఊరికి దగ్గర్లో ఒక పెద్దకాపుకు మూడొందల ఎకరం ఉండేది. ఏరువాక పూర్ణిమ రాగానే దుక్కి దున్ని ఊడుపులకు పురమాయించడానికి ఇరవై నాగళ్లలకు పైనే వెళ్లేవి.

“ఎన్ని రోజుల్లో ఎవరెక్కువ దుక్కి దున్నితే అంత గొప్పగా అనుకునేవాళ్లు. రాత్రి వెన్నెల్లో కూడా సాళ్లు, ఇరవాళ్లు దున్నినోళ్లం దున్నినట్టే ఉండేవాళ్లం. పెద్దకాపు

ప్రాపకం కోసం మా రైతు తను నిద్రపోయేవాడు కాదు. మమ్మల్ని నిద్రపోనిచ్చేవాడు కాదు.

“సంక్రాంతినాడు ఆ పెద్దకాపుగారే ఎడ్లపందాలు పెట్టేవారు. నరకమంటే ఏంటో మాకప్పుడు కనబడేది. పెద్దపెద్ద రాతిదూలాలు కట్టి పోటీ పెట్టేవాళ్లు. మామూలుగా అయితే వ్యవసాయ పనుల్లో ఏ వడ్లబస్తాలో ఎక్కువేస్తే చురుగ్గా బరువు లాగలేకపోతే ఖంశీ కర్రతో చర్మం బద్దలై రక్తం అట్టకట్టేలా కొడతారు. ఈ ఎడ్ల పందాల్లో అయితే ముల్లుకర్రతో గుచ్చేవారు. ఇంకా వేగంగా పరిగెత్తడానికి మా తోకను మెలితిప్పేవారు. పందేలంటే సంస్కృతీ సంప్రదాయాలంటారు. వాటికోసం పంటి బిగువున బాధను బిగబట్టి ఉండేవాళ్లం. మా కాళ్లకున్న నాడాలు బద్దలయ్యేలా పరిగెత్తేవాళ్లం.

“కాలం ఎప్పుడూ ఒకలాగుండదు. దోరెద్దు నోటి నుండి నురగ కక్కేది. రోజు రోజుకీ సొంగ కారడం ఎక్కువైంది. మా రైతు నాటువైద్యం చేయించాడు. మొదట్లో గడ్డి ముట్టేది కాదు. రోజులు గడిచేకొద్దీ నీరు కూడా తాగలేకపోయింది. అందరూ గాలికుంటు వ్యాధి అన్నారు. నోట్లోనూ, కాళ్లగిట్టల మధ్యలోనూ పుళ్లు పడ్డాయి. నన్ను దూరంగా వేరే చెట్టుకు కట్టేసారు. ఈలోగా రైతు వ్యవసాయ పనులకు ట్రాక్టర్ కొనుక్కొచ్చాడు. దోరెద్దు బాధను చూడలేక దానివంక చూసేదాన్ని కాదు. పగోడికి కూడా ఆ గతి పట్టకూడదు. ఒకరోజు అది చచ్చిపోయింది.

“ఎడ్లబండి పొయ్యిలో పుల్లలై పోయింది. ప్రతి ఊరిలోనూ నాలా ఒక ఆఖరెద్దు మిగిలింది. నాగలితో భూమిని చీల్చి దుక్కి దున్నినందుకు నేలతల్లి మాకిచ్చిన శాపమేమో! ఈ నేలపై జీవించే హక్కును కోల్పోయాం.”

ఇసుకరేణువు, నదినీరు కాళ్లీడ్చుకుంటూ వెనుదిరిగాయి. ఇద్దర్లో ఎవరూ ఎవరితో మాట్లాడుకోలేదు.

సృష్టి పరిణామక్రమం ఇసుకరేణువు నెమ్మదిగా గ్రహిస్తూంది. ఇంత పెద్ద విశ్వంలో ప్రతిదాని గొప్పదనం అర్థమవుతూంది. అన్ని జీవితాలపై దృష్టి సారించడానికి తన అస్తిత్వపు దుర్బలత్వాన్ని తెలుసుకోవడానికి ఇదొక గొప్ప సమయంగా ఇసుక రేణువు భావిస్తూంది.

ఎక్కడో గొంగళిపురుగు సీతాకోకచిలుకగా పరివర్తన చెందుతూంది.

దుబ్బుల్లో పాలుపోసుకున్న వరిగింజలన్నీ కంకులుగా మారుతున్నాయి. అవి అంతరించిపోయిన పక్షిగానాన్ని కలవరిస్తున్నాయి. తమకు అస్తిత్వాన్నిచ్చిన నేలకు

కృతజ్ఞతాభావంతో దాని బంగారురంగు తమకు పులుముకుని వడ్లగింజలవుతున్నాయి.

ఆ సుందర దృశ్యాన్ని ఇసుకరేణువు కన్నార్పకుండా చూస్తుండిపోయింది. సృష్టి రహస్యం అంతుబట్టింది.

ఇసుకరేణువు నదినీటితో కలిసి తిరిగి నదిలోకి జారిపోతూ, ''ఇన్నాళ్లూ తీరం వల్లే నదికి అస్తిత్వం ఏర్పడిందనుకున్నాను. కానీ, నది వల్లే తీరానికి అస్తిత్వమొచ్చింద,''ని ఒప్పుకుంటుండగా నది చుంబన స్పర్శతో రేణువును తనలోకి లాక్కుంది.

ఒక మధ్యాహ్నం ఆఖరెద్దు నీళ్లు తాగడానికి నది దగ్గరకొచ్చింది. నది హృదయం స్పందించింది. ప్రేమతో పరవశించింది.

నాగరికత అవశేషమైన ఎద్దువైపు నదికంటే అపరిమిత ప్రేమతో చూసింది ఇసుకరేణువు.

*పాలపిట్ట మాసపత్రిక*
*ఫిబ్రవరి 2022*

*




5 ఏప్రిల్ 1987న పశ్చిమ గోదావరి జిల్లాలో పుట్టిన **జుజ్జూరి వేణుగోపాల్** మొదటి కథ పచ్చకాకి జనవరి 2016 తెలుగు వెలుగు మాసపత్రికలో అచ్చయింది. ఒక కవితాసంపుటి, ఆల్టర్ ఇగో కథాసంపుటి ప్రచురించారు. తెలుగు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు.

***చిరునామా:** పుట్లగట్లగూడెం, దేవులపల్లి పోస్ట్, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ 534 451*

*ఫోన్: 99123 95420* **reddyseemakadhalu@gmail.com**